

# ఆదూరి సావిత్రి

తట్టెడు పేడ ముందేసుకుని, దాంట్లో ఊక, బొగ్గుల పొడి కలిపి, పిడకలు కొడుతోంది విశాలాక్షి..

"అమ్మా" అనబోయి ఆగిపోయాడు సూర్యం. తల్లినే తదేకంగా చూస్తూ నిలబడ్డాడతను . చిక్కి పోయి, నల్లగా అయిపోయిన విశాలాక్షి మెడ దగ్గర ఎముక పొడుచు కొస్తోంది

పొదవాటి పుల్లలకు చర్మం తగిలించినట్లున్నాయి చేతులు ఆ చేతులు నిర్విరామంగా పని చేస్తూనే ఉంటాయి సంసారాన్ని నిలబెట్టటానికి వెలిసిపోయి, చిరుగుపట్టిన కల నేత చీర మెడలో మాసిపోయిన పసుపుతాడు చెవులకు నీరు దిగి రాళ్ళు ఊడిపోయిన కమ్మలు ముక్కుకు బేసరి కాంతి కోల్పోయిన కళ్ళు దిగులు గూడు కట్టుకుని ఉన్న మొహం

కళ్లల్లో నీళ్ళు తిరిగాయి సూర్యానికి

ఒకప్పుడు ఈ ఇంట్లో పరిస్థితులింత హీనంగా ఉండేవి కావు ఎక్కువగా ఏం లేకపోయినా కనీసం తిండికీ బట్టకీ లోటుండేది కాదు తనూ 'చెల్లీ చదువుకుంటూ ఉండేవారు తండ్రి జీతం తక్కువే అయినా తమ కుటుంబ సభ్యులు నలుగురే అవటం దీనికితోడు తల్లి దొడ్లో కాయించే కాయా కసరూ ఒక గేదె పాడి వీటితో తమ సంసారం ప్రశాంతమైన గోదారిలో నెమ్మదిగా సాగే చిన్ని పడవలా ఉండేది

ఆ రోజు

హఠాత్తుగా ముంచుకొచ్చిన కెరటాల తాకిడికి ఆ పడవ దాదాపుగా తలక్రిందులైన రోజది

విశాలా! ఇహ రేపట్నుంచీ నేను గుడికి వెళ్ళక్కర్లేదు నీతో పాటు ఇంట్లోనే వుంటాను రోజంతా నవ్వుతూ అనబోయిన నారాయణాచార్లు ప్రయత్నం పలించలేదు దుఃఖం ఆయన గొంతులో గురగురలాడుతోంది

కారు మేమాచ్ఛాదిత గగనతలంలా ఉందాయన మొహం నిర్ఘాంతపోయినట్లుగా భర్తనే చూస్తోంది విశాలాక్షి కొన్ని నెలలుగా పేపర్లో దీని గురించి వివాదాలు వింటూనే ఉందామె అయినా ఎక్కడో ఏదో అడ్డుపడి అలా జరగదనే ఆశతో నెట్టుకొచ్చారిన్నాళ్ళూ

వెనకటికెవడో ఏడేళ్ళు కర్రసాము కత్తిసాము నేర్చుకునొచ్చి తన ప్రతాపాన్ని చూపించటానికి మూలనున్న ముసలమ్మను చంపాట్ట'

అచ్చం అలాగే ఉందిది!

గుళ్లో పూజారులవి ఓ గొప్ప ఉద్యోగాలా? వాళ్ళకిచ్చేవి గొప్ప జీతాలా? వాళ్ళ

మిదెందుకీ బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించటం?

కొన్నాళ్ల క్రితం జరిగిన 'కరిణీకాల రద్దు' ప్రభంజనంలో తన తండ్రి సంసారం ఇలాగే నేల కూలిపోయింది

ఇప్పుడు తమరు '

దేముడి ఆస్తిని దోచుకుంటూ పూజారులు ఊరివాళ్ళను దోచుకుంటూ కరణాలు బాగా బలిసిపోయారు అందుకే వాళ్లను ఊడబెరికాం మేం అభ్యుదయ పథంలోకి పయనిస్తున్నాం అని దొరతనంవారు గర్వంగా వెన్ను విరుచుకోవటం వందిమాగదులు మెచ్చుకుంటూ స్తోత్ర పాఠాలు చదవటం

కొన్ని డిపార్టుమెంట్లలో కొందరు లంచం తీసుకుంటున్నారని మొత్తం ఆ డిపార్టుమెంట్లనే రద్దు చెయ్యాలనుకోటం మూర్ఖత్వం!

శరీరంలో ఒక భాగం చెడిపోతే నేర్పుగా దాన్ని బాగు చేసుకోటానికో అది వీలవకపోతే ఆ భాగాన్ని తొలగించి అయినా మిగతా శరీరాన్ని పదిలంగా కాపాడుకోటానికి ప్రయత్నిస్తాం అంతేగానీ మొత్తం శరీరాన్నే నాశనం చెయ్యాలనుకోం గదా

పాలకుల ఇనప పాదాల కింద తమలాంటి దీనుల కుటుంబాలిలా నలిగి నశించిపోవాల్సిందేనా'?

వంశపారంపర్య హక్కు రద్దు చేస్తారు గానీ ఇప్పుడున్న పూజారులు మాత్రం కొనసాగుతారన్నారు కదండీ మరి మిమ్మల్నెందు కిలా హఠాత్తుగా తీసేశారు?' ఆక్రోశంగా అడిగింది విశాలాక్షి

నేను ట్రైనింగ్ అవలేదట మంత్రపుష్పం కూడా సరిగ్గా చెప్పలేకపోయానట ఇంకా చాలా అన్నారులే చివరికి నేను ఆ గుడిలో పూజారి పదవిలో కొనసాగటానికి అనర్హుడిని అని తీర్మానించి నన్ను ఇంటికి పంపేశారు నిస్త్రాణగా అన్నాడు నారాయణాచార్యులు

మీరు ట్రైనింగవలేదా! మీకు మంత్రపుష్పం రాదా? నమ్మే విషయమేనా ఇది? మీ తండ్రి పూజారి పండితుడు చిన్నతనం నుంచే మీకు తన పాండిత్యాన్ని ఆయన నూరిపోశాడు తెల్లవారు ఝామున చలిలో నీటి తడిలో మీరు ఆయన దగ్గర పొందింది ట్రైనింగ్ కాదా? మీరు గుడిలో మంత్రాలు చదువుతుంటే మీ వాక్శుద్ధికి ఎందరు భక్తులు పరవశించలేదు?

ఇది అన్యాయమని ఎవరూ నిలదియ్యలేదా వాళ్ళని?'

ఎవరు నిలదీస్తారు విశాలా? ప్రభుత్వం కొన్ని చట్టాలు చేస్తుంది వాటికి కొన్ని కన్నాలుంటాయి కొందరు అధికారులు ఆ కంతల్లో దూరి ఆ చట్టాన్ని తాము ఆక్రమించుకుంటారు

తాగుడు నిషేధిస్తారు అందువల్ల తాగుబోతు తాగటం మానడు ఆ చట్టాన్నుపయోగించుకుని పై వాళ్లు జేబులు నింపుకుంటారు

ఇంతటి తెలివితేటలు గల వ్యవస్థ మనది ఈ తెలివితేటల గురించి ప్రశ్నించే అధికారం మనలాంటి సామాన్యులకి లేదు

రేపెలా అనే దిగులు ఆ దంపతుల మొహాల్లో గూడుకట్టుకోవటం ప్రారంభించింది

హఠాత్తుగా జరిగిన ఈ సంఘటన నారాయణాచార్యుల్ని బాగా దెబ్బతీసింది తనిహ అసమర్థుడు ఈ సంసారాన్ని తను పోషించలేడు అనే భావం ఆయనను భ్రంపంలా కోస్తోంది

అనారోగ్యంతో దిగులుతో మంచం పట్టాడాయన కుటుంబ భారం విశాలాక్షి మీద పడింది

అప్పడాలొత్తి పడియాలు పెట్టి పిడకలు కొట్టి మిషను కుట్టి ఆమె చేతులు విరామమెరుగని పని చేస్తున్నా ఆ సంసారం పూర్వపు కనీస స్థితికి చేరుకోలేకపోయింది సూర్యం బి ఎ ఫస్ట్ క్లాస్‌లో పాసయ్యాడు అతనీ సంసారాన్ని చేతుల్లోకి తీసుకొని విశాలాక్షికి కాస్త విశ్రాంతి కల్పిస్తాడని కొండంత ఆశతో ఎదురు చూస్తున్నారు నారాయణాచార్యులు

కానీ ఉన్న ఉద్యోగం ఊడగొట్టి వాడి నోటి దగ్గర కూడు లాగటం చాలా తేలిక అదో సెన్సేషనల్ న్యూస్ దానికో అభ్యుదయపు ముసుగు

ఇంత తేలిక కాదు ఒక వ్యక్తికి ఉద్యోగాన్ని కల్పించి ఇచ్చి ఆ సంసారాన్ని నిలబెట్టటం

అందుకే సూర్యానికి ఉద్యోగం రాలేదు

చెయ్యి వెనక్కి తిప్పి నుదుటికి పట్టిన చెమటను తుడుచుకుంటూ తల తిప్పి చూసింది విశాలాక్షి

అదేమిట్రా? అలాగే నిలబడిపోయి కొత్తగా చూస్తున్నావు? అన్నదామె చిరునవ్వుతో

ఏం లేదమ్మా '' తడబడుతూ అన్నాడు సూర్యం

* * * *

ఎన్ జి ఓ లు స్ట్రైక్ చేస్తున్నారు

బోడితే! మీరు సమ్మె చేస్తే మేం



బెదురుతామనా? మీ స్థానాల్లో నిరుద్యోగ పట్టభద్రుల్ని నియమిస్తాం చావండి అన్నారు ప్రభుత్వంవారు ఉత్సాహంగా అప్పుడే అక్కడక్కడ కొందర్ని నియమించేశారు కూడా

సూర్యానికి ఉద్యోగం దొరికింది

నిజం! నిజంగానా సూర్యం! నిజమేనా'? సంభ్రమంగా అడిగింది విశాలాక్షి

నిజమేనమ్మా మ్లానమైన మొహంతో అన్నాడు సూర్యం

జీతమెంత?

రోజుకు ఇరవై రూపాయలు

అదేమిటి రోజు కూలీలాగా? నెలకింత జీతమని కాదా?

కాదు రోజు కూలీనే '

నాకర్థం కావటల్లేదు రా

అంతేనమ్మా నెల జీతం ఎలా ఇస్తారు? ఈ ఉద్యోగం కనీసం ఓ నెల రోజులన్నా ఉంటుందనే గ్యారంటీ ఏం లేదుగా? '

అంటే?

స్ట్రైక్ చేస్తున్న కొందరు ఎన్ జి ఓ ల స్థానంలో నాలాంటి కొందర్ని నియమించారు వాళ్ల స్ట్రైక్ కాలాఫ్ అవగానే మమ్మల్ని పీకేస్తారు అది రెండు రోజుల్లో జరగొచ్చు పది రోజుల్లో జరగొచ్చు లేదా ఇంకొన్నాళ్లు పట్టొచ్చు అందుకే మమ్మల్ని రోజు కూలీ పద్ధతిలో తీసుకున్నారు అవసరాన్ని బట్టి ఎంత రేటు ఇస్తామన్నా చచ్చినట్లు ఒప్పుకుంటాం మేము

దినదినగండంగా ఈ ఎన్ జి ఓ ల సమ్మె గొడవ ఎంతకీ పరిష్కారం కాకూడదు ప్రభుత్వం వాళ్ళ కోరికల్ని మన్నించకూడదు ప్రభుత్వానికీ వాళ్ళకీ మధ్య ఏర్పడ్డ బిగింపు అలాగే కొనసాగాలి అని వెయ్యి దేముళ్ళకి మొక్కుకుంటూ ఈ ఉద్యోగాలలో తాత్కాలికంగా కొనసాగుతూ ఉంటాం మేము వాళ్ళు తిరిగి తమ తమ ఉద్యోగాలలో చేరగానే వాళ్ళని తిట్టుకుంటూ శాపనార్థాలు పెట్టుకుంటూ మొహం వేలాడేసుకొని మేం బయటకొచ్చేస్తాం''

ఇదన్యాయం కాదురా సూర్యం? ఇలా నిరుద్యోగుల అవసరం మీద దెబ్బకొట్టి వాళ్ల జీవితాలతో చెలగాటాలాడడం

ఇది అన్యాయం కాదూ? అని ప్రశ్నించటం మానెయ్యాలమ్మా మనం ఎందుకంటే దీనికి జవాబు చెప్పేంత తీరిక ఓపిక ఎవరికీ లేదిప్పుడు ఆ రోజు నాన్న విషయంలో కూడా ఇలాగే ఆక్రోశించావు నువ్వు

ఈ రోజు నా విషయంలోనూ అంతే

ఇది శేష ప్రశ్న!

దీనికి జవాబు లేదు

దీనికి సరయిన జవాబు దొరికిననాడు ఈ వ్యవస్థ ఇలా ఉండదు ●